బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

● మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించటం ఖాయమని సనత్‌నగర్ నియోజకవర్గ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గంలోని క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ప్రతినిధులతో శుక్రవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని చెప్పారు. ముఖ్యంగా డబుల్ బెడ్రూమ్ నిర్మాణం, దళితబంధు, బీసీ బంధు పథకాల కింద ఎంతో మందికి లబ్ధి చేకూర్చామన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మూడోసారి భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, ధీరజ్, సామేల్, దయాకర్, శ్యామ్‌సన్, ముస్లీం ప్రతినిధులు ఫహీన్, అఖిల్, ఆరిఫ్, మోహిత్, రజాక్, షబ్బి పాల్గొన్నారు.

బేగంపేటలో సాయికిరణ్ ప్రచారం..

బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించాల్సిందిగా ఆయన తనయుడు తలసాని సాయికిరణ్ యాదవ్ శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మసీదు సమీపంలో ముస్లిం సోదరులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కారు గుర్తుపై ఓటేసి అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రచారంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్ గౌడ్, మహ్మద్ అఖిల్ అహ్మద్, మహ్మద్ ఆరిఫ్, శేఖర్ ముదిరాజ్, సయ్యద్ జాహెద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న నోముల



నోముల ప్రకాశ్‌రావును పార్టీలో చేర్చుకుంటున్న కేటీఆర్

సికింద్రాబాద్: కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశ్ రావు శుక్రవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నోములతో పాటు నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జగదీశ్వర్, బీ బ్లాక్ అధ్యక్షుడు సురేశ్‌లాల్ తదితర కాంగ్రెస్ నాయకులు టీ.పద్మారావుగౌడ్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ కోసం కష్టపడే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు. బిట్ల రఘునందన్, శ్రీశైలం, సునిల్, జలంధర్, శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం



ఎన్నికల ప్రచారంలో పవన్‌కుమార్ గౌడ్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో శుక్రవారం పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించాలని ఇంటింట కరపత్రాలను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పాలనలో ముఖ్యంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని చెప్పారు.ఈ సందర్భంగా పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఆయన విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు.

విద్యార్థి అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తాం



లాలాపేట: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట శుక్రవారం విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, నాగరాజు మాట్లాడుతూ.. జార్జిరెడ్డి జంపాల, చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాదశ్రీహరి కోలాశంకర్ చేరాలు రంగవల్లి లాంటి విప్లవ విద్యార్థి నేతలు ఈ దేశంలో జరుగుతున్న దోపిడీ, పీడన అసమానతలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేఖ విధానాలపై ఉద్యమాలు నిర్వహించి, తమ ప్రాణాలను ఈ సమాజం కోసం అర్పించారని కొనియాడారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. నవీన్, వంశీ, హర్షిత్, హరీష్, వివేక్,సిద్దు, ప్రశాంత్, ముఖేష్, సాయి, పవన్ పాల్గొన్నారు.

సద్ది కట్టుకుని సభకు రండి: మంద కృష్ణ మాదిగ



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మందకృష్ణ మాదిగ

కంటోన్మెంట్: ఎస్సీ కులాల వర్గీకరణే లక్ష్యంగా మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో చేపట్టిన విశ్వరూప మహాసభకు ఆయా కులాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఆయా కులాలపై ఉందన్నారు.ఎస్సీ వర్గీకరణ జరిగినప్పుడే మాదిగ ఉపకులాల జీవితంలో వెలుగులు ఉంటాయన్నారు. మూడు దశాబ్దాలుగా పోరాటం చేయగా, మధ్యలో ఐదు సంవత్సరాలు మాత్రమే అమలైందన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ కేంద్రం చేతుల్లోనే ఉందన్నారు. తమ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా వస్తున్నారంటే మన సమస్యకు దాదాపు పరిష్కారం లభించినట్లే అన్నారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తమ సద్ది తామే కట్టుకుని సభ ప్రారంభానికి ముందే పరేడ్ గ్రౌండ్‌కు చేరుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు అశోక్, శ్రీకిషన్, అజిత్ కళ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నాం



అభిషేక్ రవిచంద్ర

చిలకలగూడ : సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కొంతమంది కాంగ్రెస్ నాయకులు వేరే పార్టీలో చేరడంతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తాము కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నామని సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి అభిషేక్ ముదిరాజ్, రవిచంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ యాదవ్ నాయకత్వంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ విజయానికి తమవంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులతో పాటు తాము కూడా ఇతర పార్టీలో చేరినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తమన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత పటిష్ట పర్చి సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు.

ఆశావహులు అవాక్కయ్యారు!

- కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి ఉత్కంఠకు తెర
- ఆసక్తికరంగా శ్రీగణేశ్ టికెట్ వ్యవహారం
- అటు ఇటు తిరిగి మళ్లీ బీజేపీ నుంచి రంగంలోకి..
- సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన వైనం



శ్రీగణేశ్‌తో భానుక నర్మద మల్లికార్జున్, జంపన ప్రతాప్, సాద కేశవరెడ్డి, కార్పొరేటర్ దీపిక



శ్రీగణేశ్‌తో కలిసి నామినేషన్ కేంద్రంలోకి వెళ్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన కంటోన్మెంట్ బీజేపీ టికెట్ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నగరంలోనే అత్యధికంగా 67 మంది ఆశావహులు బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఆఖరి రోజు ఆ జాబితాలో లేని రెండు పేర్లు తెరపైకి వచ్చాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కృష్ణ ప్రసాద్‌కు టికెట్ ఖరారైందంటూ గురువారం సాయంత్రానికి వార్తలు వచ్చాయి. శుక్రవారం ఉదయం సైతం ఆయనే నామినేషన్ వేయనున్నట్లు పలువురు బీజేపీ నేతలు భావించారు. ఉదయం 9.30 గంటలకు పార్టీ అధికారికంగా ప్రకటించిన జాబితాలో శ్రీగణేశ్ పేరు వెలువడింది. దీంతో ఒక్కసారిగా ఆయన అభిమానులు సంబురాల్లో మునిగి తేలగా, మిగతా ఆశావహులు అవాక్కయ్యారు.

2018లోనూ ఆయనే...

కంటోన్మెంట్ ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ జీవితం ప్రారంభించిన నారాయణ్ శ్రీగణేశ్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నామినేటెడ్ పదవిని దక్కించుకున్నారు. 2014లో కంటోన్మెంట్ కాంగ్రెస్ పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, టికెట్ దక్కలేదు. 2018లోనూ మరోసారి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించిన ఆయన చివరి నిమిషంలో బీజేపీలో చేరి అధికారిక అభ్యర్థిగా మారారు. ఎన్నికల అనంతరం స్థానిక బీజేపీ నేతలతో పొసగక, నాలుగు నెలల్లోనే బీఆర్ఎస్‌లో చేరారు. నాటి నుంచి పార్టీతో పనిలేకుండా శ్రీగణేశ్ ఫౌండేషన్ పేరిట ప్రజల్లోకి వెళ్లారు. తన సేవా కార్యక్రమాలను విస్తతం ప్రజాదరణ పెంచుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎమ్మెల్యే సాయన్న మరణంతో మళ్లీ బీఆర్ఎస్‌లో పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అయితే అధిష్టినం బీఆర్ఎస్ అభ్యర్థిగా సాయన్న కుమార్తెకు టికెట్ కేటాయించడంతో ఆయన మరోసారి కాంగ్రెస్ వైపు చూశారు. గత నెలలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, కాంగ్రెస్ తమ అభ్యర్థిగా వెన్నెలను ప్రకటించింది. దీంతో డోలాయమానంలో పడ్డ శ్రీగణేశ్ తాను ఎన్నికల్లో పోటీ చేసేది లేదంటూ అనుచరులకు చెప్పుకొచ్చారు.

ఒక్కడి వెంట ఆ నలుగురు..

కంటోన్మెంట్ రాజకీయాల్లో కీలక వ్యక్తులుగా పేరొందిన నలుగురు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జే. రామకృష్ణ, సాద కేశవరెడ్డి, భానుక నర్మద మల్లికార్జున్, జంపన ప్రతాప్ తమ మధ్య విభేదాలు పక్కనపెట్టి ఒక్కటయ్యారు. శ్రీగణేశ్ తమ పార్టీ అభ్యర్థిగా మారితే గెలుపు సునాయసం అవుతుందని భావించి, ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. అయితే గత అనుభావాల దృష్ట్యా తనకు టికెట్ విషయంలో హామీ లభిస్తేనే బీజేపీలో చేరతానని పట్టుబట్టారు. దీంతో అధిష్ఠానాన్ని ఒప్పించిన ఆ నలుగురు మాజీ ఉపాధ్యక్షులకు తోడు మోండా కార్పొరేటర్ కొంతం దీపిక నరేశ్, పార్టీ జిల్లా అధికార ప్రతనిధి బీఎన్ శ్రీనివాస్‌లు.. శ్రీగణేశ్‌కు టికెట్ ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. దీంతో పార్టీలో చేరకుండానే శ్రీగణేశ్ బీజేపీ అభ్యర్థిగా మారాడు. కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తానే స్వయంగా పార్టీ బీ-ఫారం, ఏ-ఫారం తీసుకుని వచ్చి శ్రీగణేశ్‌కు అందించి దగ్గరుండి మరీ నామినేషన్ వేయించారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్.. సికింద్రాబాద్



పార్టీలో చేర్చుకుంటున్న పద్మారావుగౌడ్

చిలకలగూడ: గడిచిన పదేళ్లలో అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రాస్‌గా సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని, మరోమారు అవకాశం కల్పిస్తే అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుపుతామని బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి, చింతబావి, పార్థిబస్తీ, ఎన్టీఆర్‌నగర్, హమాలీబస్తీ, 8వ నంబరు గల్లీ, చిలకలగూడ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల వ్యయంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సికింద్రాబాద్‌లో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. హ్యాట్రిక్ గెలుపు ఖాయమని, గతం కన్నా మరింత మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. హోసన్న పెంతికోస్తు మిషనరీ చర్చిలో పాస్టర్ జాయ్ ఆధ్వర్యంలో పద్మారావు గెలుపు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రచారంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, శైలజ, ప్రసన్నలక్ష్మీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం




నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్

సనత్‌నగర్: నామినేషన్ల ఘట్టానికి తెరపడింది. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో పాటు మరో 21 మంది వివిధ పార్టీల పేరిట, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ (బీఆర్ఎస్), మర్రి శశిధర్‌రెడ్డి (బీజేపీ), కోట నీలిమ (కాంగ్రెస్), ఉప్పలపాటి శ్రీనివాస్ (యుగ తులసి పార్టీ), సయ్యద్ ఖదీర్ (మజ్లిస్ మార్కాజ్-ఇ-సియాసీ పార్టీ), కుమ్మరి వెంకటేశ్వర్లు (ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్), సుజాత (జై మహా భారత్ పార్టీ), వీజేఎస్ ప్రకాష్‌రావు పలువాయి (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), చెక్కల కాంచనమాల (బీఆర్ఎస్ రెబల్), కార్తీక్ మేడి (ధర్మ సమాజ్ పార్టీ), సరరపు శ్రీశైలం (తెలంగాణ రాజ్య సమితి), విజయ విజ్ఞాన శాంతికుమారి (నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ), యేసుబాబు పావులూరి (ఇండియా ప్రజా బంధు పార్టీ), గాలీకర్ సోని (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా), గున్నేబోయిన అఖిలేష్ (బీఎస్పీ) మోరే హేమ (ఇండియన్ బిలీవర్స్ పార్టీ) లతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా దేవేందర్ కొన్నే, శ్రీనివాస్, మార్కండేయ రంగాపురం, మహమ్మద్ ఆల్తాఫ్, వరుణ్‌రాజ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. 16 మంది 37 సెట్లు నామినేషన్‌ను వేసినట్లు రిటర్నింగ్ అధికారి కిషన్ రావు తెలిపారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆఖరి రోజు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగా ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మొత్తంగా 14 మంది 27 నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ తరఫున లాస్య నందిత (3 సెట్‌లు), కాంగ్రెస్ తరఫున జీవీ వెన్నెల (3 సెట్‌లు) బీజేపీ తరఫున ఎన్. శ్రీగణేశ్ (4 సెట్‌లు) నామినేషన్లు వేయగా, కరుణాకర్ బూడిద (బీఎస్పీ), పోతురాజు వెంకట్రావు (యుగ తులసి పార్టీ), పుష్పాంజలి (ఇండియన్ ప్రజా కాంగ్రెస్), పెండి పైడి రాజు (ఇండియా ప్రజా బంధు పార్టీ), జాజుల భాస్కర్ (శ్రమజీవి పార్టీ - 2 సెట్‌లు), నామినేషన్లు వేశారు. బీజేపీ రెబెల్ అభ్యర్థులుగా బి.రజనీ, మన్నె శ్రీనివాస్, కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థులుగా నాతి రాగ మంజుల, గజ్వేల్ భరత్, బి. కిరణ్ కుమార్ (ఇండిపెండెంట్), సతీష్ కుమార్ (ఇండిపెండెంట్) అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.

రవీంద్రభారతి పాఠశాలలో దీపావళి వేడుకలు



వేడుకల్లో దీపాలు వెలిగిస్తున్న సిబ్బంది

అమీర్‌పేట: అమీర్‌పేట రవీంద్రభారతి స్కూల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండగల ప్రత్యేకతలు విద్యార్థులు తెలుపాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సరిత అన్నారు. చిన్నారులందరు పర్యావరణాన్ని కాపాడటం కోసం ఇకో ఫ్రెండ్లీ జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పాఠశాల ఆవరణలో డీన్ శ్రీదేవి, డీఐ.మధు, అధ్యాపకులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల దీపాలు వెలిగించారు.

మూడ్రోజుల శిశువుకు రెండు రకాల గుండె సమస్యలు

శస్త్ర చికిత్సతో ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు



చిన్నారితో డాక్టర్ అనిల్‌కుమార్

రాంగోపాల్‌పేట్: మూడు రోజుల శిశువుకు గుండెలో రెండు రకాల సమస్యలు ఏర్పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారికి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్సను ద్వారా ప్రాణాలు కాపాడారు. కిమ్స్ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ పిడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అనిల్‌కుమార్ ధర్మపురం వివరాలు వెల్లడించారు. జహీరాబాద్‌కు చెందిన మూడు రోజుల చిన్నారికి ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టెరీస్(టీజీఏ) టోటల్ ఎనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టీఏపీవీసీ) అనే రెండు రకాల సమస్యలు గుండెలో ఏర్పడి శరీరం మొత్తం నీలం రంగులోకి మారింది. ఈ రెండు సమస్యలకు వెంటనే శస్త్ర చికిత్స చేయకపోతే చిన్నారి ప్రాణాలకే ప్రమాదం . సాధారణంగా రెండు ప్రధాన రక్తనాలాలు గుండె నుంచి శరీరం, ఊపిరితిత్తులకు రక్తాన్ని తీసుకెళ్తాయి. టీజీఏ సమస్యతో ఈ రెండు పరస్పరం మారిపోవడంతో శుద్ధి చేసిన రక్తం శరీరానికి అందక, ఊపిరితిత్తుల్లో రక్తంతో ఆక్సిజన్ కలవకపోవడంతో రక్తం శుద్ధికాక చెడు రక్తం వెళ్లడంతో శిశువు శరీరం నీలం రంగులోకి మారింది. టీఏపీవీసీ సమస్యతో ఊపిరితిత్తుల నుంచి గుండెలోని కుడి కర్ణికకు వెళ్లాల్సిన రక్తం, ఎడమ కర్ణికలోకి వెళ్తోంది. టీజీఏ సమస్య కోసం తారుమారైన బృహద్ధమని, ఊపిరితిత్తులకు వెళ్లే రక్తనాళాలలను శస్త్ర చికిత్సతో సరైన స్థితిలో అమర్చారు. బృహద్ధమనిని ఎడమ జఠరికకు, ఊపిరితిత్తుల రక్తనాళాన్ని కుడి జఠరికకు అమర్చారు. టీఏపీవీసీ సమస్యకు ఊపిరితిత్తుల రక్తనాళాన్ని తీసి సరియైన చోట అమర్చారు. గుండెకు సంబంధించిన రక్త నాళాలన్ని చాలా చిన్నవిగా ఉండటం మూడురోజుల శిశువు కావడంతో నిపుణులైన వైద్య బృందంతో ఒక రోజంతా శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇలా రెండు సమస్యలతో శిశువు జన్మించడం ప్రపంచంలోనే అరుదైనదని డాక్టర్ అనిల్ కుమార్ ధర్మపురం తెలిపారు. ప్రస్తుతం చిన్నారి పూర్తిగా ఆరోగ్యంగా ఉందన్నారు.

ఉత్సాహంగా హెచ్‌పీఎస్ క్రీడోత్సాహం



మాట్లాడుతున్న పుల్లెల గోపీచంద్

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ క్రీడా వార్షిక క్రీడోత్సావం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఆవరణలోనే బసలత్ జ్యా స్టేడియంలో నిర్వహించిన క్రీడా ఉత్సవంలో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ఆయా క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. అంతకుముందు విద్యార్థులు పాఠశాల హెచ్‌బాయ్, హెడ్ గర్ల్ పర్యవేక్షణలో నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రదర్శన అబ్బురపర్చింది. క్రీడోత్సాహానికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, జాతీయ కోచ్ పుల్లెల గోపిచంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువు, విజ్ఞానంతో పాటు క్రీడలు దైనందిన జీవితంలో ఓ భాగంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డా. స్కండ్‌బాలి, రిజిష్టర్ కల్నల్ శర్మ, పాల్గొన్నారు.

ఓయూ-జేఎన్‌టీయూ హెచ్ ఒప్పందం

లాలాపేట: ప్రీ-ఇంక్యుబేషన్, ఇంక్యుబేషన్, యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేసిన ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్(ఓబీటీఐ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలు (జెఎన్‌టీయూహెచ్) పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నారు. శుక్రవారం ఓయూలో జరిగిన సమావేశంలో ఓబీటీఐ సీఈఓ డాక్టర్ ఆర్ హఫీజ్ బాషా, జేటీబీఐ ప్రోగ్రాం మేనేజర్ స్వాతి ఆనందం సమక్షంలో ప్రొ.ఇ. విద్యాసాగర్, ప్రొఫెసర్ ఎం. ఆశారాణి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు దరఖాస్తు ఫారాలను సమష్టిగా పంపిణీ చేయడం, సమర్పించిన ప్రతిపాదనలను మూల్యాంకనం చేయడానికి ఓబీటీఐ, జేటీబీఐలు కలిసి స్క్రీనింగ్ కమిటీని రూపొందించడానికి కలిసి పని చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌లో ఇన్‌చార్జ్ లొల్లి!

● అర్ధంతరంగా ప్రచారం ముగించిన లాస్య

కంటోన్మెంట్: ఇప్పటికే గ్రూపు తగాదాల్లో సతమతమవుతున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ అదనపు ఇన్‌చార్జ్ నియామకం సరికొత్త వివాదానిక తెర లేపుతోంది. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా మంత్రి తలసాని శ్రీనివాస్‌ను ప్రకటించిన అధిష్ఠానం రెండు వారాల క్రితం అదనపు ఇన్‌చార్జ్‌గా గజ్జెల నాగేశ్‌ను ప్రకటించింది. అయితే పార్టీ అభ్యర్థి లాస్య నందితతో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. బీఆర్ఎస్ ప్రచారం సాగుతున్న ప్రాంతాల్లో అడపా దడపా గజ్జెల నాగేశ్ పాల్గొంటున్నారు. అయితే తనకు సరైన సమాచారం ఇవ్వకుండానే ప్రచారాలు చేస్తుండటంపై ఆయన లాస్యపై గుర్రుగా ఉన్నారు. తాజాగా శుక్రవారం ఉదయం మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో లాస్య నందిత పాదయాత్ర చేపట్టారు. మంత్రి తలసాని కూడా పాల్గొంటారని ఆమె పార్టీ శ్రేణులకు సమాచారం ఇచ్చారు. చివరి నిమిషంలో మంత్రి పర్యటన రద్దు కాగా, లాస్య నందిత స్థానిక నేతలతో కలిసి అంబేడ్కర్ నగర్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. మరో అరగంటలో ప్రచారం ముగుస్తుందనే సమయంలో గజ్జెల నాగేశ్ బస్తీకి చేరుకున్నారు. పార్టీ అభ్యర్థి ప్రచారం పట్ల తనకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదంటూ నిలదీశారు. మోండా డివిజన్‌లోన కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహ ముదిరాజ్ పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది మంది కార్యకర్తల ముందు గజ్జెల నాగేశ్ అలా వ్యవహరించడం పట్ల మనస్తాపానికి గురైన లాస్య ప్రచారాన్ని అర్ధంతరంగా ప్రచారం ముగించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నాన్న చేసిన సాయాన్ని గుర్తు చేస్తూ..

అంతకు ముందు లాస్య నందిత, సోదరి నివేదితతో కలిసి అంబేద్కర్ నగర్‌లోని ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలుకరిస్తూ ముందుకు సాగారు. ఈ బస్తీలో సుమారు 200 మందికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కడంతో ఆయా లబ్ధిదారులు లాస్యతో తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. కొందరైతే సాయన్నను తలుచుకుని కంటనీరు కూడా పెట్టారు. వారిని ఓదారుస్తూ ముందుకు సాగిన సాయన్న తనయలకు చివరల్లో పార్టీలోని విభేదాలు మింగుపడకుండా మారాయి.

బదిలీపై వెళ్తున్న హెచ్ఎం వెంకటేష్‌కు సన్మానం

రసూల్‌పురా: న్యూ బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తూ బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ వీడ్కోలు సమావేశంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల జీవితంలో బదిలీలు సర్వ సాధారణమని పనిచేసిన పాఠశాల్లో మంచిపేరు తెచ్చుకున్న వారు విద్యార్థులు, తల్లిదండ్రులకు తోటి ఉపాధ్యాయుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కష్టపడే తత్వం ఉన్న వెంకటేష్ సార్ బదిలీ కావడం బాధాకరమన్నారు. పాఠశాల అభివృద్ధి, మౌలికవసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారని జంపన తెలిపారు. వెంకటేష్ మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా ఒకే పాఠశాల్లో పని చేశానని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నానని చెప్పారు.

సికింద్రాబాద్ మెట్రో స్టేషన్‌లో లిఫ్ట్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శుక్రవారం ఈ సదుపాయాన్ని ప్రారంభించారు. సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లే ప్రయాణికులకు ఈ లిఫ్ట్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ, రేతిఫైల్ బస్‌స్టేషన్ వైపు ఎలివేటర్ సదుపాయం కూడా త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. దీనివల్ల నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ ప్రధాన రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులు తమ లగేజీతో తేలిగ్గా రైల్వేస్టేషన్‌కు చేరుకోవచ్చునన్నారు. అలాగే మెట్రో దిగి బస్సుల్లో వెళ్లాల్సిన వారు కూడా రాకపోకలు సాగించేందుకు లిఫ్ట్, ఎలివేటర్ సేవలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ, ఎల్అండ్‌టీ సంస్థలు సంయుక్తంగా లిఫ్ట్ సదుపాయాన్ని ఏర్పాటు చేశాయన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ, మెట్రో వంటి ప్రజా రవాణా సేవలను విరివిగా వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ, ఎల్అండ్‌టీ సంస్థలు పరస్పర సహకారంతో ప్రయాణికులకు మరింత మెరుగైన,నాణ్యమైన సేవలందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.